ఏచూరి అమర్ రహే !

- నీ ఆశయాల కోసం కంకణబద్ధులవుతాం కామ్రేడ్..
- మీ మరణం వామపక్షాలకే కాదు.. యావత్ దేశానికే తీరని లోటు...
- కమ్యూనిస్టు యోధుడికి సిపిఎం రాష్ట్ర కమిటీ ఘన నివాళి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

నీ ఆశయాల సాధన కోసం కంకణబద్ధులవుతాం కామ్రేడ్, అదే మా ఆశయం, లక్ష్యం అంటూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి పార్టీ రాష్ట్ర కమిటీ ఘన నివాళులర్పించింది. ఆయన మరణం సిపిఎం, వామపక్షాలకేకాదు, యావత్ దేశానికే తీరని లోటని సంతాపం వెలిబుచ్చింది. గొప్ప సైద్ధాంతిక నిబద్ధతగల నేత, మార్క్సిస్టు మేధావి, ఉత్తమ పార్లమెంటేరియన్, సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలపై అనర్గళంగా మాట్లాడిగలిగిన ఏచూరి కన్నుమూయటం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. దేశం అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఆయన మరణంతో పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యంతో ఢిల్లీలో కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను గురువారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహించారు. ఆ పార్టీ సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య, జూలకంటి రంగారెడ్డితోపాటు పలు ప్రజా సంఘాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొని ఏచూరికి ఘన నివాళులర్పించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి వీరయ్య, చెరుపల్లి, నాగయ్య, జూలకంటి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల సంతాపాన్ని వెలిబుచ్చుతూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ...ఏచూరి ఇక లేరన్న వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నైలో పుట్టి, హైదరాబాద్‌లో పాఠశాల విద్యనభ్యసించి, ఢిల్లీ జెఎన్‌యులో విద్యార్థి నేతగా ఎదిగిన ఆయన... ఎమర్జెన్సీ సమయంలో ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీనే ప్రత్యక్షంగా ఎదుర్కొన్నారని తెలిపారు. ఆ సమయంలో ఆయన జైలు జీవితం గడిపారని చెప్పారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఏచూరి, 50 ఏండ్ల తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు దశ, దిశా, నిర్దేశం చేశారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీ సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూ అండగా నిలిచారని గుర్తు చేశారు. అంతకుముందు విద్యుత్ పోరాటం, భూ పోరాటాల సందర్భంగా ఆయన విలువైన సూచనలు, సలహాలనిచ్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పోరాటం సందర్భంగా అండగా నిలబడ్డారని అన్నారు. ఏచూరి చూపిన బాటలో పయనించటం ద్వారా ఆయన ఆశయాల సాధనకు ప్రతినబూనాలని వీరయ్య ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నాగయ్య మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా అందరూ అభిమానించే గొప్ప నేత సీతారాం ఏచూరి అని కొనియాడారు. పాలకుల విధానాలను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ వాటిని పార్లమెంటు లోపలా, బయటా తూర్పారబట్టిన నేత అని నివాళులర్పించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాశ్మీర్ జఠిలమైన సమస్యల్లో చిక్కుకున్నప్పుడు వాటిని ఎదుర్కొని ఆ రాష్ట్రంలో అడుగుపెట్టిన ధీశాలి.. ఏచూరి అని తెలిపారు. చెరుపల్లి మాట్లాడుతూ... దేశ రాజకీయాల్లో ఏచూరి సుదీర్ఘకాలంపాటు కీలక, క్రియాశీలక పాత్రను పోషించారని గుర్తు చేశారు. తాను డివైఎఫ్ ఐలో ఉన్నప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో ఆయన చేసిన ప్రసంగం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని అన్నారు. కేంద్రకమిటీ సమావేశాలకు వెళ్లినప్పుడల్లా తెలుగువాడైన ఏచూరిని చూసి తమకు పెద్ద దిక్కు ఉందని అనుకునేవారనీ, ఇప్పుడా అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా ఇండియా వేదికను ఏర్పాటు చేయటంలోను, దాన్ని నిలబెట్టటంలోను, ముందుకు నడిపించటంలోనూ ఆయన పాత్ర మరువలేనిదని చెప్పారు. జూలకంటి మాట్లాడుతూ... ఏచూరితో తనకున్న బంధాన్ని, అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన త్వరలోనే కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారని భావించామని అన్నారు. కానీ అందుకు భిన్నంగా ఏచూరి మరణ వార్తను వినాల్సి రావటం కలచి వేసిందని వాపోయారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను ఆప్యాయంగా, పేరు పెట్టి పిలిచే ఆయన లేకపోవటం దిగ్భ్రాంతికరమని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీ సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు మా భుజాల మీద తుపాకి పెట్టి కాల్చొద్దంటూ ఆయన పార్లమెంటులో వ్యాఖ్యానించటం ద్వారా వాటిని ఎదుర్కొనేందుకు మార్గదర్శనం చేశారని వివరించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల మధ్య అనేక భిన్నాభిప్రాయాలున్నా వాటిని ఒప్పించి, మెప్పించి ఒకే వేదిక మీదికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతందని చెప్పారు. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు అక్కడ పరిస్థితిని చక్కదిద్దేందుకు వీలుగా ఆ దేశ వామపక్షాల ఆహ్వానం మేరకు ఏచూరి అక్కడికి వెళ్లారని గుర్తు చేశారు. అంతటి కమ్యూనిస్టు మేధావి అయిన సీతారాం మరణం దేశానికి తీరని లోటని ఆయన నివాళులర్పించారు.

ఏచూరి మృతి దేశానికి నష్టం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మతోన్మాదం పెచ్చరిల్లుతున్న తరుణంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం దేశానికి తీరని నష్టమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు ఆయన మరణం అత్యంత లోటని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్‌లో తమిళనాడులో జరగనున్న పార్టీ జాతీయ మహాసభల్లో కీలక కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టాల్సిన తరుణంలో ఏచూరి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు దూరమవడం విషాదకరమని అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి ఆయన మృతికి సంతాపం తెలిపారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. 14వ తేదీ మధ్యాహ్నం వరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌లో సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఉంచుతారని, ఆ తర్వాత పరిశోధనల నిమిత్తం హాస్పిటల్‌కు అప్పగిస్తారని చెప్పారు. ఏచూరి మృతికి పార్టీ తెలంగాణ కమిటీ తరపున సంతాపం ప్రకటిస్తున్నట్టు చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సంతాప కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, బండి రమేష్, వై.విక్రం, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, సీనియర్ నాయకులు పి.సోమయ్య, ఎం.సుబ్బారావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, సీతారాం ఏచూరితో ప్రత్యక్ష సంబంధం ఉన్న అనేకమంది న్యాయవాదులు, ఇతర ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరితో మాజీ ఎంపి వినోద్ కుమార్ (ఫైల్ ఫొటో)

ఏచూరి పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే..

- ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరనిలోటు
- కరీంనగర్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితాంతం ప్రజల పక్షాన చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని కరీంనగర్ మాజీ ఎంపి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సీతారాం మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఏచూరి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయనతో తనకున్న పరిచయం, ఆయన ప్రజా పోరాటాల స్ఫూర్తి తెలుపుతూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. నాలుగు దశాబ్దాల కాలం నుంచి సీతారాంతో వ్యక్తిగత పరిచయం ఉందని, గత ఏడాది వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనతో కలిసి పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

ఏచూరి మరణం పట్ల మంత్రి పొన్నం సంతాపం

సీతారాం ఏచూరి మరణం తనని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సీతారాం ఏచూరి కార్యకర్త నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు అంచెలంచెలుగా ఎదిగిన గొప్ప నాయకుడు అని, ప్రజల పక్షాన ఎన్నో ఉద్యమాల్లో పోరాడారని గుర్తు చేసుకున్నారు. సీతారాం ఏచూరి మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఏచూరి మరణం బాధాకరం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీతారాం ఏచూరి కమ్యూనిస్టు భావజాలంతో నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు సిపిఎంలోనే కొనసాగుతూ అత్యున్నతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తిస్తూ తుది శ్వాస విడవటం బాధాకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మరణవార్త తనను తీవ్రంగా బాధించిందని తెలిపారు. ఆయన మృతి తెలుగు ప్రజలకు తీవ్ర విషాదకరమైన అంశమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, శ్రామిక, రైతు వర్గంల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి ఆయన అని కొనియాడారు. సీతారాం ఏచూరి మృతికి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సైద్ధాంతిక విభేదాలు, భిన్నాభిప్రాయాలు ఎన్ని ఉన్నా నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన సీతారాం ఏచూరిని గౌరవిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఏచూరి మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎన్నో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం బాధాకరమని బిజెపి పార్లమెంట్ బోర్డు సభ్యులు, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్వశక్తితో ఎదగాలనే మహిళా సంఘాలకు నిధులు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వశక్తితో ఎదగాలనే మహిళా సంఘాలకు సిఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించారని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లాలో మంత్రి పర్యటించారు. ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి శ్రీ మహాలక్ష్మి మిల్క్ పార్లర్, కోమలి డిజిటల్ స్టూడియో, బుక్ స్టాల్, జిరాక్స్ సెంటర్, ఎంబ్రాయిడరీ వర్క్స్ లను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. స్వశక్తితో అభివృద్ధి చెందాలన్న ఆశయంతో మహిళా సంఘాలకు సిఎం నిధులు కేటాయించారన్నారు. అనంతరం రామ్ సింగ్ తండాలో రూ.1.10 కోట్ల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు, శివతండా నుంచి నౌశ్య తండా వరకు రూ.1.20 కోట్లతో బిటి రహదారిని మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు.ములుగు జిల్లా కేంద్రంలోని జాకారం గురుకుల విద్యాలయం వెనుక భాగంలో ఉన్న స్థలంలో రూ.28.25 లక్షలతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్ర భవనం ప్రారంభించారు. ములుగు నుంచి బుద్దారం వరకు రూ. 6 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నాలుగు రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ములుగు మండలంలో చింతకుంట నుంచి పులిగుండం వరకు రూ.75 లక్షలతో నిర్మాణం చేపట్టిన రహదారిని ప్రారంభించారు. గోవిందరావుపేట మండలంలోని ఫ్రూట్ ఫారం గ్రామంలో రూ.1.68 లక్షల నిధులతో బిటి రోడ్డు, పాత నాగారం రూ.65 లక్షల నిధులతో నిర్మించిన బిటి రహదారిని ప్రారంభించారు.

తెలుగు రాష్ట్రాలతో ఏచూరికి ప్రత్యేక అనుబంధం

- విద్యుత్ ఉద్యమం, భూపోరాటం, మహాజన పాదయాత్రలో భాగస్వామ్యం
- అనేక ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిన అగ్రనేత : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలుగు రాష్ట్రాలతో, ముఖ్యంగా ప్రజలతో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ప్రత్యేక అనుబంధం ఉన్నది. ఆయన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఉభయ రాష్ట్రాల్లోనూ అన్ని కీలక సమయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రత్యక్షంగా పార్టీ సమావేశాల్లో పాల్గొని ఉద్యమాల రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో ఆయన బాల్యం గడపడంతోపాటు విద్యా భ్యాసం చేశారు. దీంతో ఈ నగరంతో ఆయనకు విడదీయలేని అనుబంధ ఉన్నది. ఇక్కడికి వచ్చినపుడు అనేక సభల్లో మాట్లాడేటపుడు 'నేను ఢిల్లీకి వెళ్లి చాలా కాలం అయ్యింది. అక్కడ తెలుగు మాట్లాడే అవకాశం రాదు.ఇంగ్లీష్, హిందీలోనే మాట్లాడాలి. ఇప్పుడు తెలుగులో మాట్లాడ్డం కష్టమే. అయినా మీకోసం మాట్లాడ్డానికి ప్రయత్నిస్తాను. ఏమైనా తప్పులు మాట్లాడితే క్షమించండి.'అన్న ఏచూరి మాటలు అందరికీ గురుతొస్తాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంతోపాటు విద్యుత్ ఉద్యమంలో తనదైన పాత్రను నిర్వహించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏడు నెలలపాటు సాగిన భూపోరాటంలోనూ ముఖ్య భూమికను పోషించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధనలో కూడా ఆయన పార్టీకి అనేక సూచనలు ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో సున్నితమైన వాతావరణం నెలకొన్న సందర్భంలోనూ పార్టీ తీసుకున్న సైద్ధాంతిక నిర్ణయాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో ఎత్తుగడలను రూపొందించడం లో ఆయన తోడ్పాటు నందించారు. తెలంగాణ అంశంపై యూపీఏ-1 హయాంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకోకుండా ఇతర పార్టీలపై నెట్టివేయడంపై 'మా భుజాల మీద తుపాకీ పెట్టి ఎందుకు కాల్చుతారు'అని సీతారాం ఏచూరి మాటలు రాజకీయ పార్టీల నాయకులతోపాటు ప్రజలను ఆలోచింపజేశాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో మహాజన పాదయాత్ర సుదీర్ఘంగా సాగింది. అందులోనూ ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. పాదయాత్రలో నడిచి ప్రజలతో మమేకమయ్యారు. మహాజన పాదయాత్ర ప్రారంభసభకు ప్రకాశ్ అంబేద్కర్, ముగింపు సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తోపాటు సీతారాం ఏచూరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇలా అనేక ఉద్యమాలు, కీలక సమయాల్లో తెలుగు రాష్ట్రాలతో ఆయన తన పాత్రను నిర్వహించారు.

17న పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ పతాకావిష్కరణ

- సిఎస్ శాంతికుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉదయం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ప్రజా పాలనా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశాన్ని ఆమె గురువారం నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవమైన 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తారనీ, అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పిఎ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. 17న గణేష్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియచేయాలని నగర పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్‌తో ఇరాన్‌ది శతాబ్దాల అనుబంధం


- పర్యాటక రోడ్‌షోలో ఇరాన్ టూరిజం శాఖ మంత్రి షల్బాఫియాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌తో ఇరాన్‌ది శతాబ్దాల చారిత్రక, సాంస్కృతిక అనుబంధమని ఇరాన్ టూరిజం శాఖ సహాయ మంత్రి షల్బాఫియాన్ అన్నారు. రెండు దేశాల మధ్య పర్యాటక రంగంలో పరస్పర సహకారం పెంపొందించుకోవడం లక్ష్యంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రోడ్‌షోను తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియాతో పర్యాటక సంబంధాల మార్పిడిని మరింత వేగవంతం చేసుకొనేందుకు నూతన విధానం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇరాన్ పట్ల సానుకూల వాతావరణాన్ని ప్రమోట్ చేయడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా పర్యాటక రోడ్ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సందర్శకుల మార్పిడి వల్ల రెండు దేశాల్లో ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ రెండు దేశాలను కలిపే వారధిగా నిలుస్తుందని అభివర్ణించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఇరాన్ వారసత్వ సంపద అవగాహనకు రోడ్ షో గొప్ప వేదికగా నిలవనుందని అన్నారు. పర్యాటకమంటే కొత్త ప్రదేశాలను సందర్శించడం మాత్రమే కాదనీ, వేరే సంస్కృతులను అర్థం చేసుకోవడంతో పాటు ఆర్థిక అభివృద్ధికి శక్తివంతమైన సాధనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, ఇరాన్ కాన్సులేట్ సెకండ్ కన్సుల్ మోహసిన్ మొగద్దమి, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ టూరిజం డైరెక్టర్ జనరల్ షోజేహి, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, వివిధ ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

డెంగీని సమర్థవంతంగా ఎదుర్కొంటాం : టిఎస్‌హెచ్‌ఎ

ప్రజాశక్తి - హైదరాబాద్



డెంగీ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టిఎస్‌హెచ్‌ఎ) ప్రధాన కార్యదర్శి ఆర్ గోవింద్ హరి తెలిపారు. ఈ ఏడాది డెంగీ సీజన్ సాధారణం కంటే ఆలస్యంగా ప్రారంభ మయ్యిందన్నారు. డెంగీ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. దీన్ని ప్రభుత్వ, ప్రయివేట్ హెల్త్‌కేర్ రంగాలు రెండూ సమర్థవంతంగా ఎదుర్కొంటు న్నాయన్నారు. ప్రస్తుతం డెంగీ కంటే చికున్‌గున్యా కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ రెండు వ్యాధులను ఎదుర్కోవడానికి ఇంటి చుట్టూ, ఇంట్లో దోమలు లేకుండా చూసుకోవాలన్నారు.

ఎస్‌సి వర్గీకరణ పై అధ్యయనానికి మంత్రుల కమిటీ నియామకం

హైదరాబాద్ బ్యూరో : ఎస్సీ వర్గీకరణపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ కో-చైర్మన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపి మల్లు రవిని నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్‌సి వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, ఈ అంశంతో ముడిపడి ఉన్న అన్ని అంశాలపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గతంలో ఇదే పద్ధతిలో విద్యార్థులను విస్మరించడంతో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపారని అన్నారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి అధ్వానంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పరపు రోహిత్, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, సందేశ్, సుధీర్, అక్షయ్, సాత్విక్, హరీష్, కరణ్ సింగ్, అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కేంద్ర బృందాల పర్యటన

- నష్టాన్ని అంచనా వేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన
- సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్న బృంద సభ్యులు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీంచేందుకు వచ్చిన కేంద్ర బృందం గురువారం రెండో రోజు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అడ్వైజర్ కల్నల్ కెపి సింగ్ నేతృత్వంలో మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్కె. కుష్వాహ, టి.నియాల్ కన్సన్, డాక్టర్ శశివర్ధన్‌రెడ్డితో కూడిన కేంద్ర బృందం ముగ్గురు చొప్పున రెండు బృందాలుగా జిల్లాల్లో పర్యటించింది. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మొదటి బృందం ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప, ఖమ్మం నగరంలోని కాల్వఒడ్డు బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్ మున్నేరు బ్రిడ్జి, మోతీనగర్ ప్రాంతాల్లో, రెండో బృందం ఖమ్మంరూరల్ మండలం దానవాయిగూడెం, తల్లంపాడు-తెల్దారుపల్లి, తనగంపాడు, నగరంలోని ప్రకాష్‌నగర్‌లో పర్యటించింది. భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ, మున్నేరు ఉధృతిని, ప్రవాహం ఏ మేరకు వచ్చిందని, ప్రవాహం ఎంత సమయం మేర నిలిచింది, నష్ట వివరాలను ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కేంద్ర బృందానికి వివరించారు. దెబ్బతిన్న ఇళ్లు, సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిన కుటుంబాలను కేంద్ర బృందం సభ్యులు కలిసి, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.

వరదల్లో నష్టపోయిన ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని, తక్షణమే సాయం కింద.. కేంద్రం రూ.3 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహకారం అందించాలని కోరుతూ కేంద్ర బృందానికి, ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలోని పద్మావతినగర్, వెంకటేశ్వం నగర్, బొక్కలగడ్డ, మంచికంటినగర్, మోతీనగర్, పంపింగ్‌వెల్ రోడ్, పెద్దమ్మతల్లిగుడి, సుందరయ్య నగర్, ప్రకాష్ నగర్, ఎఫ్‌సిఐ పాత గోదాము వెనుక ప్రాంతాలు మున్నేరు వరద ముంపునకు గురయ్యాయని తెలిపారు.

కోదాడ నియోజకవర్గంలో..

సూర్యాపేట జిల్లా, కోదాడ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ముంపు ప్రాంతాలైన అనంతగిరి మండలం గోండ్రియాల, తొగర్రాయి, నడిగూడెం, కాగిత రామచంద్రపురంలను క్షేత్రస్థాయిలో కేంద్ర అధికారుల బృందం పరిశీలించింది. నియోజకవర్గంలో వరద ముంపునకు గురైన ఇండ్లతో పాటు ఇసుక మేటలు పెట్టిన పొలాలను, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. గోండ్రియాలలో వరదలకు కూలిన గూటి పార్వతమ్మ, గంటు గరతయ్య ఇళ్లని, పాఠశాలలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో వరద బాధితులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు వరద వల్ల తమకి జరిగిన నష్టాన్ని కేంద్ర అధికారులకు వివరించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ చల్లించాలని, యాంటీ లార్వా స్ప్రే చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో 15 రోజుల్లో మూడు సార్లు డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే చేయాలని వైద్యాధికారులకు సూచించారు. తదుపరి తొగర్రాయి గ్రామంలో తెగిన రోడ్డు, వంతెనల పరిస్థితిని ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జిల్లా కలెక్టర్ బృందానికి వివరించారు. నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద ఎన్‌ఎస్‌పి ఎడమ కాలువకు పడిన గండిని పరిశీలించారు. పాలేరు రిజర్వాయర్‌లో తొమ్మిది అడుగులు మేర నీరు ఎక్కువ రావటంతో అవి వెనక్కి వచ్చి గండి పడిందని కలెక్టర్ వివరించారు. వేగవంతంగా కాలువ లైనింగ్ పనులు, గండి పూడ్చటం పూర్తి చేసి ఆయకట్టుకి నీరు విడుదల చేయాలని కేంద్ర అధికారుల బృందం ఇరిగేషన్ అధికారులను ఆదేశించగా.. వారం రోజుల్లో గండి పూడ్చి నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్‌కు అనుమతివ్వండి

- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో గురువారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది.విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నిర్ణయంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వాన్ని విద్యుత్ బిడ్డింగ్‌కు అనుమతించాలని ఎన్‌ఎల్‌డీసీని ఆదేశించింది. దీంతో విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వానికి అడ్డంకి తొలగింది.

కాగా,విద్యుత్ కొనుగోలుకు సంబంధించి బకాయిల చెల్లింపుపై వివాదం కొనసాగుతోంది. రూ.261 కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు చేయడంతో తెలంగాణ డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. గురువారం ఉదయం నుంచి విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్స్ఛేంజీలు నిలిపివేశాయి. దీంతో గత్యంతరం లేక పవర్ గ్రిడ్‌పై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసింది.



లక్ష్మారెడ్డి భార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పొంగులేటి, సంతోష్

లక్ష్మారెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి, మాజీ ఎంపి సంతోష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆయన స్వగ్రామం ఆవంచకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మాజీ ఎంపి సంతోష్‌కుమార్ లక్ష్మారెడ్డిని కలిసి పరామర్శించారు. లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, కోరుకుంటి చందర్, విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి కూడా నివాళులర్పించారు. లక్ష్మారెడ్డిని పరామర్శించారు.



హైదరాబాద్‌లో కిస్నా జ్యువెలరీ విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కిస్నా డైమాండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ హైదరాబాద్‌లో రెండు కొత్త షోరూంలను తెరిచింది. ఎఎస్‌రావు నగర్, సోమాజిగూడలో తమ 3వ, 4వ స్టోర్లను ఏర్పాటు చేసింది. గురువారం వీటిని హరికృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ ధోలాకియా, కిస్నా డైమాండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ డైరెక్టర్ పరాగ్ షా లాంచనంగా ప్రారంభించారు. దీంతో దేశ వ్యాప్తంగా 37, 38 షోరూంలకు విస్తరించినట్లయ్యిందని ఘనశ్యామ్ తెలిపారు. హైదరాబాద్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు సంతోషిస్తున్నామన్నారు.

యాక్టివ్‌వేర్ వార్షిక రిటైలర్స్ మీట్ ఏర్పాటు

హైదరాబాద్ : స్పోర్ట్స్, అథ్లెయిజర్ పాదరక్షల బ్రాండ్‌లలో ఒకటైన క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ హైదరాబాద్‌లో స్నేహలత అసోసియేట్స్‌తో కలిసి తమ వార్షిక రిటైలర్స్ మీట్‌ను నిర్వహించినట్లు తెలిపింది. దీనికి 250కి పైగా రిటైలర్లు హాజరయ్యారని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. "సెలబ్రేషన్స్ ఆఫ్ ఎవ్రీడే మూమెంట్స్" అనే నేపథ్యంతో దీన్ని ఏర్పాటు చేశామని క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ సిఎఒఒ ప్రేరణా అగర్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా తమకు 23,000 కంటే ఎక్కువ రిటైల్ టచ్‌పాయింట్‌ల నెట్‌వర్క్ ఉందన్నారు.

అక్రమంగా బంగారం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్న ఇద్దరిని డిఆర్‌ఐ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి దాదాపు 4కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కోల్‌కతా నుంచి రోడ్డు మార్గం ద్వారా నగరానికి పసిడిని రహస్యంగా తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరద బాధిత పాలసీదారులకు మద్దతు

బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి వరదలు ప్రజల జీవితానికి, ఆస్తికి భారీ స్థాయిలో నష్టాన్ని కలిగించిన క్రమంలో తమ పాలసీదారులకు బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సత్వర సహాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం సకాలంలో సమర్థవంతమైన క్లెయిమ్ సెటిల్‌మెంట్లను అందించి వారి పట్ల తమ నిబద్ధతను ప్రదర్శించనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి తెలిపారు. వరద బాధిత పాలసీ దారుల ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ 1800 209 7072ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరిని హత్య చేసిన మావోయిస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హత్య చేసిన ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం జరిగింది. బీజాపూర్ జిల్లా జప్పెమర్క గ్రామానికి ముగ్గురు వ్యక్తులను ఇన్‌ఫార్మర్ నెపంతో రెండు రోజుల కిందట బైరాన్ ఘడ్ ఏరియా కమిటీ మావోయిస్టులు అపహరించారు. వీరిలో మడివి సౌజా, పొడియం కోసాను ప్రజా కోర్టు నిర్వహించి చెట్టుకు ఉరివేసి హత్య చేశారు. కాగా, అపహరించిన ముగ్గురిలో మిర్తూరు హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థి పొడియం హిడ్మాను విడుదల చేశారు.

గాంధీ ఆస్పత్రిలో మానసిక రోగి దాడికి యత్నం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో బుధవారం ఒక మానసిక రోగి దాడికి ప్రయత్నించగా వెంటనే నిలువరించినట్టు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకురాలు డాక్టర్ వాణి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం వివరణ ఇచ్చారు. ఆ ఘటన తర్వాత సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేశామనీ, వారంతా షిఫ్టుల వారీగా భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. కొన్ని పత్రికల్లో రోగి సహాయకుడు దాడికి ప్రయత్నించినట్టుగా పేర్కొన్నారని, అయితే అది సరి కాదని ఆమె స్పష్టం చేశారు.

నటనలో కృత్రిమత్వం రాణించదు

గీత రచయిత సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి కల్చరల్

సినీ లేదా నాటక రంగంలో గానీ నటనలో కృత్రిమత్వం రాణించదు సహజ హాస్యం పండించే నటుడు బాబూ మోహన్ అని ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ వంశీ ఆర్ట్స్ థియేటర్స్ 53 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ నటుడు బాబూ మోహన్ కు నాటి హాస్య నటుడు రేలంగి వెంకట్రామయ్య పేరిట వంశీ జాతీయ పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుద్దాల అశోక్ తేజ బాబూ మోహన్ ను సత్కరించి మాట్లాడారు బాబూ మోహన్ మానవత వాది అనీ రాజకీయాల లోనూ మంత్రి గా పని చేసి రాణించారు అని అభినందించారు వంశీ రామరాజు జన్మ దిన సందర్భంగా ఆయనను అభినందిస్తూ నడుస్తున్న సాంస్కృతిక చరిత్ర రామ రాజు అని కొని యాడారు. వంశీ రామరాజు ఎందరికో సన్మానాలు చేసే వారని తనకు తొలి శాలువా వంశీ సంస్థ కప్పి సత్కరించింది అనీ ఆది రాష్ట్రపతి శాలువా కప్పి స్థాయికి తెచ్చిందని తెలిపారు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితవేత్త వోలేటిపార్వతీశం మాట్లాడుతూ బాబూ మోహన్ నటన లో గొప్ప చతురత వుందని అన్నారు వేదిక పై గజల్ శ్రీనివాస్ ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు నిర్మాత రామసత్యానారాయణ సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు లు అభినందన తెలిపారు దర్శక నిర్మాత (అమెరికా) . మీర్ అబ్దుల్లా ను కూడా ఆత్మీయ సత్కారం చేశారు స్వాగతం పలికిన వంశీ రామరాజు మాట్లాడుతూ అక్కినేని దాసరి నారాయణరావు సినారె లు తనను ప్రోత్సహించారనీ సుబ్బి రామి రెడ్డి సహకారం తమ సంస్థకు మరువ లేని దనీ చెప్పేరు



టిజి బిపాస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి : దాన కిషోర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ వెరిఫికేషన్ సిస్టమ్ (టీజీ బీపాస్) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు.

లేఅవుట్, భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత గడువులో అనుమతులిచ్చే టీజీ బీపాస్ దరఖాస్తుల పరిష్కార పురోగతిపై గురువారం సచివాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుతో జత చేయాల్సిన డాక్యుమెంట్లు తక్కువగా ఉంటే ఆ విషయాన్ని వారికి తెలియజేసి సవరించాలని సూచించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ టిఎస్ బీపాస్ కింద హెచ్‌ఎమ్‌డీఏ, జిహెచ్‌ఎంసిలకు వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి శనివారం టీజీ బీపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో డిటిసిలో దేవేందర్ రెడ్డి, హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, రాజేంద్రప్రసాద్ నాయక్, జిహెచ్‌ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పంచాయితీ

- కౌశిక్ రెడ్డి ఇంటికి అరికెపూడి గాంధీ
- ఇరువురి నేతల కార్యకర్తల తోపులాట...ఉద్రిక్తత
- కౌశిక్ రెడ్డి ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి
- గాంధీ అరెస్ట్.. బెయిల్‌పై విడుదల



తోపులాటలో కౌశిక్ రెడ్డి, గాంధీ నేతల కార్యకర్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఎసి చైర్మన్‌గా కాంగ్రెస్‌కు దగ్గరగా ఉన్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియామకం తర్వాత రాజుకున్న రాజకీయ వివాదం నేతల ఇళ్లపై దాడి వరకు చేరింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, గాంధీల సవాళు ప్రతిసవాళ్ల మధ్య గాంధీ గురువారం ఉదయం తన అనుచరులతో కలిసి గచ్చిబౌలి, కొల్ల విల్లాస్‌లోని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటివద్దకు రావడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ క్రమంలో ఇరువురి నేతలకు చెందిన కార్యకర్తల తోపులాటలో.. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కౌశిక్ రెడ్డి ఇంటిమీద రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. ఘర్షణపూరిత వాతావరణం నుండి వెళ్లిపోవాలని పోలీసులు సూచించినప్పటికీ వినకపోవడంతో నార్సింగ్ పోలీసులు అరికెపూడి గాంధీని అరెస్ట్ చేశారు. పరిస్థితి సద్దుమణిగాక సాయంత్రం బెయిల్ పై విడుదల అయ్యారు.

సిపి కార్యాలయంలో బైఠాయించిన బిఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి చేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కాంగ్రెస్ అనుచరులను అరెస్ట్ చేసేదాకా ఇక్కడ నుంచి వెళ్లేది లేదని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో బిఆర్‌ఎస్ నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, వివేకా నంద గౌడ్, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, శంభీపూర్ రాజు, ఎర్రోళ్ల శ్రీనివాస్ సిపి కార్యాలయం ఎదుట బైఠాయించారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దగ్గరుండి దాడిని ప్రోత్సహించిన సిఐ, ఎసిపిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే గాంధీతో పాటు, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఈ కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌ను మాజీ మంత్రి హరీశ్ రావుకు చూపించిన పోలీసులు.. ఆయనను సిపి ఆఫీస్ నుంచి వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హరీశ్ రావుతో పాటు, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలను అరెస్టు చేసిన పోలీసులు అక్కడి నుంచి తరలించారు.

కౌశిక్ రెడ్డి ప్రాంతీయ విభేదాలు రేపుతున్నారు...

బెయిల్‌పై విడుదలైన అనంతరం గాంధీ మీడియాతో మాట్లాడుతూ తనను కౌశిక్ రెడ్డి ఇంటికి రమ్మని పిలిస్తేనే వెళ్లానని, అక్కడికి వెళ్లాక బిఆర్‌ఎస్ కార్యకర్తలు గుండాల్లా వ్యవహరించి మాపై దాడికి దిగారని అన్నారు. ఈ ఘటనలో బిఆర్‌ఎస్ నాయకులు కావాలని ప్రాంతీయ విభేదాలు రేపుతున్నారని అరికెపూడి మండిపడ్డారు. తనను ఆంధ్రావాడివి అంటూ సంబోధించారని.. తక్షణమే తనకు కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ వెంటనే కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేయాలని అరికెపూడి గాంధీ డిమాండ్ చేశారు.

భూపాలపల్లికి రైల్ లైన్ క్లియర్ ఎప్పుడో?

- కలగానే రామగుండం-మణుగూరు లైన్
- సర్వేలకే పరిమితం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూపాలపల్లి జిల్లాకు రైల్ లైన్ క్లియర్ ఎప్పుడో అని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం భూపాలపల్లికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. కాజీపేట నుంచి భూపాలపల్లికి ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నామని, ఇందుకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు రైల్వే లైన్ కోసం సర్వే పనులు ప్రారంభించింది. కానీ ఆచరణలో అమలు కాలేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

వరంగల్ నుంచి భూపాలపల్లికి రావాలంటే సుమారు 70 కి.మీ బస్సులో ప్రయాణించాల్సిందే. రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరకయాతనే. రోజూ వందలాది మంది వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు భూపాలపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కాజీపేట నుంచి భూపాలపల్లికి రైల్వే లైన్ లేకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాదు.. బొగ్గు సరఫరాకు సైతం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ.. కాజీపేట నుంచి భూపాలపల్లికి కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నట్టు గతేడాది కేంద్రం వెల్లడించింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్) కోసం రూ.1,152 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీని ఆధారంగా కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించనున్నారు. మొగుళ్లపల్లి, చిట్యాల, భూపాలపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఇది ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో భూసేకరణతో పాటు వాగులపై వంతెనలు, స్టేషన్ల నిర్మాణం తదితర వాటితో పాటు ట్రాక్‌కు మట్టి నమూనాలు సేకరించనున్నారు. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే 30 నుంచి 40 నిమిషాల్లో కాజీపేట నుంచి భూపాలపల్లికి చేరుకొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. హన్మకొండ, హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారికీ ఉపయోగకరంగా ఉంటుంది.

రామప్ప, మేడారానికి అనుసంధానం

భూపాలపల్లి మీదుగా నిర్మిస్తున్న రైల్వేను పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు అనుసంధానం అవుతున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరుకు వెళ్లే లైన్‌తో రామప్పకు కనెక్టివిటీ కానుంది. ఈ మేరకు రైల్వే శాఖ కూడా ప్రకటించింది. దీని కోసం గతంలోనే వెంకటాపూర్‌లో ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు. అదే విధంగా కాజీపేట-భూపాలపల్లి లైన్‌తో మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరను అనుసంధానం చేస్తున్నట్టు రైల్వేశాఖ అధికారులు ప్రకటించారు. రైలు ఆశలు పట్టా లెక్కుతుండడంతో భవిష్యత్తులో మరిన్ని కొత్త మార్గాలు ఏర్పడి భూపాలపల్లి పారిశ్రామిక అభివృద్ధికి, ములుగు పర్యాటక అభివృద్ధికి అడుగులు పడతాయని పలువురు సంతోషించారు. కానీ పనులు ఆలస్యం కావడంతో నిరాశలో ఉన్నారు.

రామగుండం-మణుగూరు సర్వే

భూపాలపల్లి జిల్లా కేంద్రం మీదుగా తొలుత కోల్‌రైల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2023-24 బడ్జెట్‌లో ఈ మేరకు నిధులను కేటాయించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి మంథని, భూపాలపల్లి జిల్లా తాటిచర్ల, భూపాలపల్లి మీదుగా వెంకటాపూర్ (రామప్ప), తాడ్వాయి అడవుల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోపాల్‌రావుపేట మీదుగా మణుగూరు వరకు 198 కిలో మీటర్ల రైల్వే ట్రాక్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రైల్వేలైన్ నిర్మాణానికి ఫైనల్ లోకేషన్ సర్వే కోసం ప్రభుత్వం రూ.3,600 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు. ట్రాక్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ఉన్న మట్టి తట్టుకోగలదా..? అనే అంశాన్ని పరిశీలించారు. మట్టి నాణ్యతనుబట్టి ట్రాక్ నిర్మాణం చేయనున్నారు. రామగుండం నుంచి మణుగూరు వరకు గుర్తించిన పాయింట్లలో మట్టి నమూనాల సేకరణ చేపట్టారు. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు రవాణా సులభం కానుంది. ప్రతిపాదిత రామగుండం- మణుగూర్ లైన్ ఏర్పాటైతే ఎన్నో ఉపయోగాలు జరగనున్నాయి.

రవాణాను మెరుగుపరచాలి : బందు సాయిలు, సిపిఎం జిల్లా కార్యదర్శి

జిల్లా ప్రజల ఆకాంక్షను ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన అవసరం ఉంది. రవాణాను మెరుగుపరచాలి. 2002 నుంచి 2004 వరకు బండారు దత్తాత్రేయ రైల్వే సహాయ మంత్రిగా ఉన్న సమయంలో రామగుండం- మణుగూరు రైల్వేలైన్ సర్వే జరిగింది. కానీ ఇప్పటి వరకు అతీగతీలేదు. ప్రధాని మోడీ సైతం పలుమార్లు హామీలు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఈ అంశాన్ని ప్రతిసారీ నాయకులు లేవనెత్తుతున్నారు తప్పితే పార్లమెంట్‌లో గళం ఎత్తడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి జిల్లాకు రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

బొగ్గు సరఫరాకు ఉపయోగం : కంపేట రాజయ్య, సింగరేణి బ్రాంచి కార్యదర్శి ,భూపాలపల్లి

భూపాలపల్లికి రైల్వేలైన్ ప్రతిపాదించి ఏండ్లు గడుస్తోంది. కార్యరూపం దాలిస్తే బొగ్గు రవాణాతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. రామగుండం, భూపాలపల్లి, మణుగూరు రైల్వేలైన్ కోల్‌బెల్ట్ ప్రాంతంలో బొగ్గు రవాణా సులువవుతుంది. కార్మికులకు, ప్రజలకు ప్రయాణపరంగా ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రస్తుతం భూపాలపల్లి లోని కేటీపీపీ విద్యుత్ కేంద్రానికి రామగుండం, భూపాలపల్లితో ఇతర ప్రాంతాలకు ఎక్కువగా బొగ్గు రవాణా సాగుతోంది. రోజుకు వందల లారీల ద్వారా ఇక్కడి నుంచి ఉప్పల్‌కు బొగ్గు రవాణాకు ఇబ్బందవుతుంది. ఉప్పల్ వరకు లారీల ద్వారా రవాణా చేసి అక్కడి నుంచి గూడ్స్ రైల్ ద్వారా పంపిస్తున్నారు. రెండు రైల్వే లైన్లలో ఏ ఒక్కటి నెరవేరినా బొగ్గు రవాణాకు ఇబ్బందులు ఉండవు.



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

ఆమె చిత్రహింసలు భరించలేం

- పిఇటి వేధిస్తున్నారని గురుకుల విద్యార్థినుల ఆందోళన
- తెల్లవారుజామునే రోడ్డుపై బైఠాయింపు
- సదరు ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఇటి వేధింపులు తట్టుకోలేకపోతున్నామంటూ గురుకుల విద్యార్థినులు ఆందోళకు దిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల పిఇటి జోష్ణ తమ పట్ల అరాచకంగా ప్రవర్తిస్తున్నారంటూ గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు విద్యార్థినులు సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. పిఇటిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. పిఇటి జోష్ణ తమను ఇష్టం వచ్చినట్టుగా బూతులు తిడుతూ, ఎలాపడితే అలా కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా బుద్ధులు నేర్పే గురువే.. అసభ్యంగా దూషిస్తే ఆమె నుంచి ఏం నేర్చుకోవాలి.. ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. క్లాస్ సమయంలో కూడా వేధిస్తున్నారని, రక్తం వచ్చేలా కొడుతున్నారని వాపోయారు. ప్రిన్సిపల్, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఇఒ, పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి విద్యార్థినులకు నచ్చజెప్పినా నిరసన విరమించేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఎంఈవో రఘుపతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా కొనసాగుతున్న పిఇటి జోష్ణను విధుల నుంచి తప్పిస్తున్నట్టు ప్రకటించారు.

గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సాయంత్రం సందర్శించారు. విద్యార్థినులు ఆందోళన చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇఒ రమేష్ కుమార్ వచ్చారు. విద్యార్థులతో మాట్లాడారు. వెంటనే పిఇటిని తొలగించారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ప్రిన్సిపల్‌కు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.